బీఈడీ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 15 : ఓయూ పరిధిలోని బీఈడీ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నవంబర్‌లో జరిగిన బీఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాక్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని తెలిపారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ప్రీ పీహెచ్‌డీ(పీహెచ్‌డీ కోర్స్ వర్క్) పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఫ్యాకల్టీల ప్రీ పీహెచ్డీ రెగ్యులర్, బ్యాక్‌లాక్, వన్ టైంచాన్స్ పరీక్షా ఫీజును ఈనెల 24లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

నేడు వృద్ధులకు ఉచితంగా వైద్య పరికరాల పంపిణీ

అమీర్‌పేట్, మార్చి 15 : ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి డీఎం ఫౌండేషన్ సహకారంతో ఎస్సార్ నగర్‌లోని శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వయోధికులకు ఉచితంగా వైద్య పరీక్షల పరికరాలను పంపిణీ చేయనున్నారు. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డీ పార్థసారథి నివాస ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వయోధికులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- అధికారులతో కలిసి బుద్ధనగర్ బస్తీలో పర్యటన

అధికారులతో కలిసి బుద్ధనగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్ మార్చి 15 : ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమీర్‌పేట్ డివిజన్ బుద్ధ నగర్ బస్తీలో శనివారం ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు పలు సమస్యలను వారికి విన్నవించారు. బస్తీలో తుప్పుపట్టిన ఇనుప స్తంభాలు ప్రమాదభరితంగా మారాయని, వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యుత్ స్తంభాలపై లెక్కకు మించి వేలాడుతున్న కేబుల్ తీగలను వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. బస్తీలో కమ్యూనిటీ హాల్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయాన్ని పేర్కొనగా విద్యుత్ సరఫరాతో పాటు అవసరమైన సివిల్ మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. బుద్ధనగర్ బస్తీ వరద నీటి సమస్య పరిష్కారానికి ఇక్కడి పైపులైన్‌ను సమీపంలోని రిలయన్స్ వీధిలోని ప్రధాన నాలాకు అనుసంధానం చేస్తే ఫలితం ఉంటుందని మాజీ కార్పొరేటర్ ఎన్. శేషుకుమారి ఎమ్మెల్యే తలసానికి సూచించారు. అదేవిధంగా బస్తీలోని అంతర్గత రహదారులు శిథిలావస్థకు చేరడంతో కొత్త రోడ్లు వేయాలని స్థానికులు కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తలసాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీ రజనీ కాంత్‌రెడ్డి, డీఈ వాసుదేవరెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎం. హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, గోపీలాల్ చౌహాన్, నరసింహ, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పేదల వైద్యానికి సహకారం అందిస్తా..

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్

లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మార్చి 15 : నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు తన వంతు సహకారం అందిస్తున్నానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పార్సీగుట్టకు చెందిన పద్మావతి రూ.2 లక్షలు, చిలకలగూడకు చెందిన మహమ్మద్ ఫిరోజ్‌కు రూ.2 లక్షలు, వారసిగూడకు చెందిన భవానికి రూ. 2 లక్షలు, అడ్డగుట్టకు చెందిన బాబుమియాకు రూ. లక్షా పదివేల చొప్పున మొత్తం రూ.7.10 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలు మంజూరయ్యాయి. ఆయా ఎల్ఓసీలను శనివారం సీతాఫలమండీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫలమండీలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలు శోచనీయం

- చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ నాయకులు

సికింద్రాబాద్, మార్చి 15 : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిన కేసీఆర్‌పై ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, స్ట్రెచర్, మార్చురీ అనే పదాలను ఉపయోగించడం దారుణమని పలువురు బీఆర్ఎస్ సికింద్రాబాద్ నియోజకవర్గ నేతలు విమర్శించారు. ఆ పార్టీ యువ నేత తీగుల్ల రామేశ్వర్‌గౌడ్ నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌కు సీఎం రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను అగౌరవ పరిచేలా మాట్లాడిన ముఖ్యమంత్రిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు గరికపాటి చంద్రశేఖర్, రాజేశ్, సాయి పాల్గొన్నారు.

నిధుల ఖర్చుపై ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చించాలి

సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మడి సూర్య కిరణ్

చిక్కడపల్లి, మార్చి 15: ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి కేటాయించిన నిధుల ఖర్చులపై ఎస్సీ ఎస్టీ శాసనసభ్యులు అసెంబ్లీలో చర్చించాలని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి గుమ్మడి సూర్యకిరణ్ అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ అధ్వర్యంలో శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులపై శ్వేతపత్రం ప్రకటించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అని అన్నారు. చెవేళ్ళ డిక్లరేషన్ ను అమలు చేయాలన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్‌చౌహాన్, బత్తుల రాంప్రసాద్, ఎస్.శివలింగం, బుర్రి ప్రసాద్,. దశరథ్, మామిడి నారాయణ, డి.మోహన్, నాయకులు పరమేశ్వరి, రమ, ఉమ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు

కార్పొరేటర్ హేమ దంపతులకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు

సికింద్రాబాద్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం రాత్రి కార్పొరేటర్ హేమ దంపతులను ఆశీర్వదించారు. నామాలగుండలోని కార్పొరేటర్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ హేమ, సందీప్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మారుతున్న కాలానుగుణంగా బోధన

సమావేశంలో ప్రిన్సిపాల్ మీసాల అప్పలయ్య తదితరులు

చిక్కడపల్లి, మార్చి 15: మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ డిజిటల్ బోధన పద్ధతులను విద్యార్థులకు అందిస్తున్నామని బీఆర్ అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పలయ్య తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలను బోధించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో విద్యార్థులకు ఉద్యోగ సాధనలో వారు ఎదుర్కొనే సంఘటనలను,వాటి పరిష్కారాలను బోధిం చనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ డాక్టర్ సందశ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంపత్ మృతికి కారణమైన పోలీసులపై కేసు నమోదు చేయాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్

చిక్కడపల్లి,మార్చి 15: పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో మృతి చెందాడని, ఆయన మృతికి కారణమైన పోలీసులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కస్టడీలో మృతి చెందిన సంపత్ కుటుంబానికి న్యాయం కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. సంపత్ మ్యాన్ పవర్ సప్లై లైసెన్స్‌తో కొంతమందిని గల్ఫ్ దేశాలకు పంపారని వారికి గల్ఫ్‌లో సరైన ఉపాధి అవకాశాలు కల్పించలేదని నెపంతో అతడిని నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. పోలీసులు మళ్లీ కోర్టు ద్వారా కస్టడీకి తీసుకొని తీవ్రంగా హింసించడం వల్లే సంపత్ మృతి చెందాడని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత పోలీస్ అధికారులను డిస్మిస్ చేసి హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. అంతేకాకుండా సంపత్ కుటుంబ సభ్యులకు యాభై లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెలుగు సారస్వతంలో సినారెకు సుస్థిర స్థానం

పురస్కార గ్రహీతలతో ఓలేటి పార్వతీశం, వంశీ రామరాజు

ముషీరాబాద్, మార్చి 15: తెలుగు సారస్వతంలో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్న సినీ గీత రచయిత సీ నారాయణరెడ్డి అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు శనివారం వంశీ ఆర్ట్స్ థియేటర్స్, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో విఖ్యాత కవి డాక్టర్ సీ. నారాయణరెడ్డి తొలి సినీ గీత రచన చేసి 65 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'సినారె పాటకు పట్టాభిషేకం' పేరుతో నిర్వహించిన మధుర గీతాలు విభావరి పలువురిని అలరించింది. ప్రముఖ గాయకులు మిత్ర, గీతాంజలి, కృష్ణ ప్రసాద్, ఇందు నయన, మాస్టర్ విజయ్ పలు గీతాలు ఆలపించారు. వోలేటి పార్వతీశం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి జలంధర, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

డీసీతో కలిసి కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్

అడ్డగుట్ట, మార్చి 15 : డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీశ్రీనివాస్ అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, ఇతర అధికారులతో కలిసి శనివారం అడ్డగుట్టలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చొరవతో త్వరలో పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. సుమారు 1.45 కోట్ల వ్యయంతో పనుల ప్రారంభానికి ఏర్పాట్లు చేశామని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఏఈ తివారీ, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మధు, సత్తయ్యగౌడ్, మనోహర్, ఎల్లయ్య, మహమ్మద్, నర్సింగ్, దేవయ్య, రామప్పచారి, అయోధ్య, మల్లేశ్, శంకర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కారానికి కృషి


జలమండలి నూతన మేనేజర్ సలీమ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, మార్చి 15 : జలమండలి బోయిగూడ సెక్షన్ మేనేజర్‌గా ఇటీవల బదిలీపై వచ్చిన షేక్ సలీమ్‌ను శనివారం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు సన్మానించారు. ఈ సందర్భంగా నూతన మేనేజర్ సలీమ్ మాట్లాడుతూ.. సెక్షన పరిధిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. జలమండలి జేటీఓ శివశంకర్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గజ్జల శీను, నా యకులు సురేశ్, టిల్లు, శివకుమార్, సలీం, రవి, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ జవాబుపత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షల జవాబుపత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పన చెల్లించి వచ్చే నెల 7లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

బీబీఏ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో బీబీఏ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ(రెగ్యులర్) ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించామని, అదే తేదీ నుంచి పరీక్షలను ప్రారంభిస్తున్నప్పటికీ ఇతర పరీక్షల తేదీలను మార్చినట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పేర్కొన్నారు.

వివిధ సైకాలజీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ సైకాలజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ, ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, పీఎస్వైడీ క్లినికల్ సైకాలజీ మొదటి సంవత్సరం రెగ్యులర్, ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మారేడ్‌పల్లి, మార్చి 15: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చేగుంట మక్కరాజ్‌పేటకు చెందిన రాజు కుమారుడు చెన్నబోయిన మహేశ్(23) నాలుగేండ్ల ఏళ్ల క్రితం నగరానికి వచ్చాడు. బేగంపేట ప్రకాశ్‌నగర్ హాస్టల్‌లో ఉంటూ జుడియో షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 11న సెలవు పెట్టి హోలీ పండుగకు సొంతూరుకు వెళ్లాడు. అక్కడ ఉండకుండా ముందు రోజు తిరిగి నగరానికి వచ్చాడు. శుక్రవారం షాపింగ్ మాల్‌కి రావడం లేదని బోయిన్‌పల్లిలో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్తున్నానని మేనేజర్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. అదే రోజు రాత్రి 9 గంటలకు మేడ్చల్–డబిల్‌పూరా రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.కాచిగూడ లోకల్ రైలు పైలెట్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చు రీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మహేశ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు.

బేగంపేటలో స్వల్ప అగ్ని ప్రమాదం

బేగంపేట్ మార్చి 15 : బేగంపేటలోని బేగంపేట ఫంక్షన్‌హాల్ సమీపంలోని ఖాళీ స్థలంలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. అమెరికన్ కాన్సులేట్ పూర్వ కార్యాలయ భవనం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఖాళీ స్థలంలోని చెత్త, ఎండిన చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకుని ఫైరింజర్ల సాయంతో నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అంతకుముందు ఉదయం కూడా ఇక్కడి ఖాళీ స్థలంలో మంటలు వ్యాపించడంతో స్థానికులు నీళ్లు చల్లి మంటలను ఆర్పారు. కాగా సాయంత్రం తిరిగి మంటలంటుకున్నాయి. ఎండ వేడిమి కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

బోయిన్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొల్లారం, మార్చి 15: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చట్టం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను వర్గీకరణ అనంతరమే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటిక శ్రీకిషన్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం బోయినపల్లి మార్కెట్‌యార్డు చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ కిషన్ మాట్లాడుతూ.. వర్గీకరణ లేకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తే ఎస్సీ ఉద్యోగాలన్నీ మాలలకే చెందుతాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. మార్చి 17న ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో పెడతామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్పటివరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. వెంటనే ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు త్వరగా అమలు చేయాలలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో మంద మధుకర్‌మాదిగ, అజిత్‌కల్యాణ్ వాల్మీకి, మధు, బాబెందర్, జగదీశ్ మాదిగ, రాజు మాదిగ, విష్ణు మాదిగ, శీను, బాలు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ

అమీర్‌పేట్ : బీకే గూడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహమ్మద్ నసీరుద్దీన్ ఖాద్రీ ఆధ్వర్యంలో శనివారం మసీదు బస్తీలో నిరుపేద ముస్లింలకు అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ శేషు కుమారి నిత్యావసరాలు పంపిణీ చేశారు.

సీఎం మాదిగలకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

చిక్కడపల్లి: సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ విగ్రహం నుంచి సుందరయ్య పార్క్ వరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు నరేశ్ మాదిగ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణను వర్తింపచేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని మండిపడ్డారు. బిక్షపతిమాదిగ, టీవీ నరసింహ, మల్లికార్జున్, కృష్ణ, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 14న భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి
- ఓయూలో ఘనంగా బీఎస్ఎఫ్ ఐదో రాష్ట్ర మహాసభ

మహాసభలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వచ్చేనెల 14న భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ నిర్వహిస్తామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. బీఎస్ఎఫ్ 5వ రాష్ట్ర మహాసభను ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్‌లో రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పిడమర్తి రవి హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ పాలనలో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. తెలంగాణలోని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ రక్షణ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఓయూ లా కళాశాల ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి వచ్చే ఆదివారం నుంచి నిత్య పూలమాల కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వివరించారు. గిరిజన శక్తి జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్‌చౌహన్ మాట్లాడుతూ.. కాన్షీరాం బహుజన రాజ్యం తెచ్చిన గొప్ప మహనీయులని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకురాలు కోటగిరి ఉషారాణి, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకట్, ప్రధాన కార్యదర్శి తోలు రాములు, ఓయూ ఇన్‌చార్జి కల్వకుర్తి శ్రీశైలం, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు మాధవచారి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, డాక్టర్ మల్లేశ్, శ్రావణ్, డాక్టర్ స్టాలిన్, శ్రీకాంత్, వీ.నరసింహ, తాళ్ల అజయ్, చెవుల కిషన్, మోహన్, దర్శనం జాన్, నవీన్ రాజ్, నాగరాజు పాల్గొన్నారు.

టన్నెల్ ప్రమాద మృతులకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలి

చిక్కడపల్లి, మార్చి 15 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ ట్రేడ్ యూనియన్ల అధ్వర్యంలో శనివారం ఎస్ఎల్‌బీసీ ఘటన, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి అవకతవకలు, పెండింగ్ సమస్యలపై చర్చ నిర్వహించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు,రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ.. సీఎం వెంటనే కార్మిక శాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికశాఖను భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఎస్ఎల్‌బీసీ ఘటన జరిగిందన్నారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాములు, కోటంరాజు, అనూరాధ పాల్గొన్నారు.

కోణార్క్ రైల్లో గంజాయి సరఫరా.. ఇద్దరు అరెస్టు

- రూ. 28.50 లక్షల విలువైన 57 కేజీల గంజాయి స్వాధీనం

మారేడ్‌పల్లి, మార్చి 15: రైల్లో అక్రమంగా బర్హంపూర్ నుంచి దాదర్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిలో ఇద్దరు అంతరాష్ట్ర సభ్యులను శనివారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 28.50 లక్షల విలువైన 57 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్ ఇందుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన జీవన్ అలియాస్ అజయ్ ముంబైలో ఉంటూ టీవీ సీరియల్స్‌లో మేకప్ అసిస్టెంట్‌గా పని చేసేవాడు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన కరణ్ అయ్యప్పన్ శెట్టి (26) క్యాబ్ డైవర్. ఇతను గంజాయి, మద్యం ఇతరాత్రా చెడు అలవాట్లకు బానిసయ్యాడు. అదే సమయంలో జీవన్‌తో సుశాంత్‌కుమార్ స్వైన్‌కు పరిచయమైంది. పది రోజుల క్రితం ఇద్దరు కలిశారు. సుశాంత్ కుమార్ స్వైన్ ఊరిలో అప్పులు చేశాడు. అప్పులు తీర్చడానికి రూ. 20 వేలు కావాలని అడిగాడు. వెంటనే జీవన్ అయ్యప్పన్ శెట్టిని సంప్రదించాడు. ఆయన సూచన మేరకు బెర్హంపూర్‌కు పిలించించాడు. అక్కడికి వచ్చిన అయ్యప్పన్ శెట్టిని లాడ్జిలో ఉంచారు. సుశాంత్‌కుమార్ స్వేన్, కరణ్ అయ్యప్పన్ శెట్టిలకు గంజాయి తరలిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయంటూ అందరూ కలిసి సమానంగా పంచుకోవాలని చెప్పారు. ఈ మేరకు జీవన్ వారిని ఈ నెల 13న బర్హంపూర్ నుంచి 57 కేజీల గంజాయి తీసుకొని కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరారు. శుక్రవారం రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సమయంలో జనరల్ బోగీల్లో వస్తున్న వీరు నిద్రలేచి చూడగా జీవన్ కనిపించలేదు. రైల్వే స్టేషన్‌లోతనిఖీ లుచేపడుతున్న పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని శనివారం రిమాండ్‌కు తలరించారు. పరారీలో ఉన్న ప్రధాన నింధితుడు జీవన్ కోసం గాలిస్తున్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT SIRCILLA.
O.S.No. 95 of 2018
Between:-
Ummenthula Venkata Harshwardhan Reddy @ Mandadi Venkata Harshwardhan Reddy ...Plaintiff
AND
Ummenthula Venkata Raghuram Reddy & others ...Defendants
To,
1.Ummenthula Venkata Raghuram Reddy s/o late Jagannatha Reddy, aged 58 years, occ: Govt. lecturer is the defendant no.1,
2.Smt. Manjula w/o late U.V. Gunavardhan reddy, aged 47 years, occ: household is the defendant no.2,
3.Ummenthula Venkata Yashowardhan Reddy s/o late U.V. Gunavardhan reddy, major, occ: Student is the defendant No.3.
4.Ummenthula Venkata Kamalakar Reddy s/o late Jagannatha Reddy, aged 45 years, occ: agriculture is the defendant no.4,
All are r/o Ananthapalli village, Boinipalli Mandal of Rajanna Sircilla District.
Take notice that the above named plaintiff filed above suit O.S.No. 95 of 2018 against you all and the above suit is posted on: 02-04-2025 at 10-30 A.M. for your appearance.
So, you all have to appear personally or through advocate on 02-04-2025 at 10-30 A.M. before the above said court in the above suit vide O.S.No. 95 of 2018, failing which above said matter will be decided in your absence as per law.
// By order of the court //
Sd/- KODAM SATYANARAYANA
ADVOCATE, Sircilla.